1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com

బాసర రైల్వేస్టేషన్ మరింత అభివృద్ధి

- వర్చువల్ పద్ధతిలో ఆధునీకరణ పనులు ప్రారంభించిన ప్రధాని

నవతెలంగాణ -ముధోల్

రాష్ట్రంలో రైల్వేలను మరింత అభివృద్ధి చేయడానికి పాటుపడతామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సోమవారం వర్చువల్ పద్ధతిలో అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌లో భాగంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను బాసర రైల్వేస్టేషన్‌లో ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా బాసరలో రూ.11.33 కోట్లతో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. స్టేషన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన కూడా జరిగిందని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైల్వేలో అపూర్వమైన అభివృద్ధిని సాధించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావ్, సెంట్రల్ రైల్వే బోర్డ్ సివిల్ ఇంజనీర్ సచిన్, డీఎంఓ కవిత, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మండల అధ్యక్షులు, బీజేపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని రాణి జిన్నింగ్ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..గూడ గ్రామం జీవతి తాలూకాకు చెందిన ఉమాజీ ఉత్తమ్ జాదవ్(33) బంధువుల పెళ్లి పత్రికలు పంచడానికి సారంగాపూర్ మండలం నాఖ తండాకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం మండల కేంద్రంలోని ఎన్‌హెచ్ 44 రహదారిపై రాణి జిన్నింగ్ ఎదురుగా పల్సర్ మోటార్ సైకిల్‌ను వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఉత్తమ్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని వాహనం కొరకు గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఎడ్‌బిడ్ మల్లన్న జాతర

- కుస్తీ పోటీలను తిలకించిన ఎమ్మెల్యే రామరావు పటేల్



నవతెలంగాణ -ముధోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుని జాతర సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నుండే కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మహారాష్ట్ర నుండి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవున్ని దర్శించుకున్నారు. కోరిన కోరికలను తీర్చాలని నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. జాతర సందర్భంగా సుమారు 25వేలకు పైగా భక్తులు తరలివచ్చి మల్లన్న దేవున్ని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా రంగులరాట్నాలు నిలిచాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కుస్తీపోటీలకు తరలివచ్చిన మల్లయోధులు

జాతరలో భాగంగా సోమవారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో జాతరలో కుస్తీపోటీలు నిర్వహించారు. తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీలో పాల్గొన్నారు. ఈ కుస్తీపోటీలు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. కుస్తీ పోటీల్లో పాల్గొన్నవారికి భోజన వసతితో పాటు పారితోషకాన్ని అందించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు సుమారు 25 క్వింటాళ్ల బియ్యంతో అన్నదానం నిర్వహించారు. అక్షర మల్టీ స్పెషలిస్ట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డా.రమేష్ రాథోడ్ ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించి భక్తులకు మందులను అందజేశారు. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముధోల్ సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాయికిరణ్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. జాతరకు బైంసా నుండి ప్రత్యేక ఆర్‌టీసీ బస్సులు నడిచాయి.

కుస్తీ పోటీలు తిలకించిన ఎమ్మెల్యే

ఎడ్‌బిడ్ మల్లన్న దేవున్ని జాతరలో భాగంగా జరిగిన కుస్తీ పోటీలను ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తిలకించారు. గెలుపొందిన మల్లయోధుకు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షులు లావణ్య రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణలత దత్తు, నాయకులు విట్టల్‌రెడ్డి, భూమన్న, నిమ్మ పోతన్న, సాయరెడ్డి, గురుప్రసాద్ యాదవ్, రాములు, ఉదయ్, మల్లేష్, సుదర్శన్, విట్టల్ యాదవ్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ గ్రామంలో సిసి రోడ్లు, మురికి కాలువల పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. గత పాలకులు తమకు ఓట్లు రాని గ్రామాలను, ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తూ వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ఓటు వేసిన గ్రామం ఓటు వేయని గ్రామం రెండు వేరు కాకూడదు ఎమ్మెల్యే మొత్తం నియోజకవర్గానికి ప్రతినిధిగా ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ.10కోట్లు కేటాయించి అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. ఈ పనులకు పరిపాలన అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ పనులన్నీ మార్చి నెలలో పూర్తయ్యే విధంగా చూస్తానని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి వచ్చిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్నీ, మోహన్, ముకుంద్‌రావు, శ్రీకాంత్, అడెల్లు, ప్రభాకర్, శ్రీనివాస్, లాలామున్న, వేదవ్యాస్ పాల్గొన్నారు.

ఐక్యత చాటేలా సంఘటితం కావాలి



ఆదిలాబాద్‌టౌన్ : ఐక్యత చాటేలా ప్రతి ఒక్కరు సంఘటితం కావాల్సిన అవసరముందని ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ పోల్కం లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీరాం కాలనీలో గల ముదిరాజ్ సంఘ భవనంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. జిల్లాకు వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను ఏకతాటిపై తీసుకువచ్చేందుకు జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి చైతన్యవంతులను చేస్తామన్నారు. ప్రభుత్వ, రాజకీయ పదవులకు లొంగకుండా సంఘ బలోపేతం, ముదిరాజ్ ఐక్యతకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, పట్టణ అధ్యక్షుడు దారవేణి రాము, ప్రధాన కార్యదర్శి దార్ల రవి, కోశాధికారి బొజ్జ సంతోష్, ఉపాధ్యక్షుడు లస్మన్న, సలేంద్ర రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో టికెట్ రేస్..!

- ఆదిలాబాద్ టికెట్ కోసం 22మంది దరఖాస్తు
- పార్టీ ముఖ్యుల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగులు
- సీటు గెలుపే లక్ష్యంగా అధిష్టానం దృష్టి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో లోక్‌సభ టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్టీ రిజర్వ్ స్థానమైన ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. తమకు టికెట్ కేటాయించాలని ఏకంగా 22 మంది ఆశావహులు పార్టీ అధిష్టానానికి దరఖాస్తులు అందించడం ఆసక్తికరంగా మారింది. ఇందులో పార్టీలో ఇది వరకే ఉన్న నాయకులతో పాటు పలువురు వైద్యులు, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, విశ్రాంత అధికారులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే ఆశావహులు వారికి తెలిసిన వారితో కలిసి అధిష్టానం ముఖ్యులను ప్రసన్నం చేసుకున్నారు. పలు దఫాలుగా ఢిల్లీ బాట పడుతూ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఎవరికీ హామీనివ్వకుండా విజయం సాధించే వారినే ఎంపిక చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ ఎంపీ సీటును గెలుచుకోవాలనే ఉద్దేశంతో అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తోందనే ప్రచారం జరుగుతోంది.



ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న నరేష్ జాదవ్(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ..లోక్‌సభ ఎన్నికలను సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ సమరంలోనూ సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. గత ఎన్నికల సెంటిమెంటును పునరావృతం చేస్తూ తాజాగా లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని సైతం జిల్లా నుంచే ప్రారంభించింది. ఈ క్రమంలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఎంపికలోనూ ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, సిర్పూర్‌లో బీజేపీ, బోథ్, ఆసిఫాబాద్ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకోగా.. ఖానాపూర్‌లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ పార్లమెంటు పరిధిలో ఒకే స్థానంలో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉంది. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ సీట్లు కోల్పోయినా.. రాష్ట్రంలో మాత్రం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకే అభ్యర్థి ఎంపికను అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎస్టీ రిజర్వ్ స్థానమైన ఈ లోక్‌సభకు బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల కంటే దీటైన వారిని రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై ఢిల్లీలో వడపోత ప్రారంభమైనట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యా ఆలోపు అభ్యర్థి ఎంపిక తుది అంకానికి చేరుకునే అవకాశం కనిపిస్తోంది.

టికెట్ కోసం 22మంది పోటీ..!

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో బరిలో నిలిచేందుకు టికెట్ కోసం అనేక మంది ఆశావహులు పోటీ పడటం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీ టికెట్ కేటాయించాలని పలు రంగాలకు చెందిన ప్రముఖులు కాంగ్రెస్ అధిష్టానికి దరఖాస్తులు అందించారు. ఒక్క టికెట్ కోసం ఏకంగా 22 మంది ఆశావహులు దరఖాస్తులు అందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులో పార్టీ నాయకులతో పాటు పలువురు వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు కూడా ఉన్నారు. గతంలో ఎంపీగా పోటీ చేసిన డా.నరేష్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్, ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, విశ్రాంత అధికారి జాదవ్ రాంకిషన్ నాయక్, శ్రావణ్‌నాయక్, రాథోడ్ ప్రకాష్, డా.మేస్రం మనోహర్, సబావత్ శ్రీనివాస్‌నాయక్, ఆర్క వసంత్‌రావు, మోకాసి దౌలత్‌రావు,గుగులోత్ ధన్‌సింగ్, సబావత్ రాములునాయక్, ఆడె చంద్రశేఖర్, మెస్రం బాబరావు, సుల్తాన్ యాదగిరి, కోట్నాక తిరుపతి, ఆత్రం రోషన్‌కుమార్, డా.కుమురం బాలు, పెందూర్ గోపి దరఖాస్తులు అందించారు. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం దరఖాస్తులు చేసిన వారినే పరిగణనలోకి తీసుకుంటుందా.. లేదంటే ఎన్నికల నాటికి ఎవరైనా ముఖ్య నాయకులు పార్టీలోకి వస్తే వారికి టికెట్ కేటాయిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

ప్రధాన్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బొజ్జు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసులు తమ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రధాన్ సంఘం ధర్మ గురువు హీరాసుక జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన్ సమాజం హీరాసుక చూపిన మార్గంలో నడవాలన్నారు. హీరాసుక కాంస్య విగ్రహం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థుల పొట్టగొట్టే ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఆదివాసుల విద్యాభివృద్ధి కోసం కుమురంభీమ్, ఆదిలాబాద్ జిల్లాలో స్టడీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గిరిజన గురుకులాల్లో వచ్చిన ఫలితాలు ఆశ్రమాల్లో ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రధాన్ సమాజ్ ధర్మ గురువు హీరాసుకకు మహిళలు, పురుషులు వారి సాంప్రదాయ పూజలు చేశారు. అనంతరం ప్రధాన్‌గూడ నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వరకు సాంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం మనోహర్, జిల్లా అధ్యక్షులు దుర్వ నగేష్, మడావి శంకర్, రామ్‌కిషన్, గోవింద్, ఆశారెడ్డి, ఆత్రం సుగుణ, కొడప నగేష్, జడ్పీటిసి అర్క పుష్పలత, పటేల్ జ్ఞానేశ్వర్, శేష నారాయణ్, సోయం రాందాస్, గెడాం భారత్ పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడపడమే జాబ్ మేళా లక్ష్యం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- జాబ్ మేళాకు విశేష స్పందన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని యువతను సన్మార్గంలో నడపడం కోసమే జాబ్ మేళా నిర్వహించినట్లు ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగిత తీవ్రత తనకు తెలుసని అక్కడి నుండే తాను వచ్చానని అన్నారు. ఎటువంటి ఉద్యోగం, సంపాదన లేనప్పుడు యువత ఆలోచనలు అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగంలో చిన్నాపెద్ద తేడా చూడకూడదని, చేసే ఉద్యోగంలో తనకంటూ ప్రత్యేకత సాధించాలన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న ఎంతోమంది కింది స్థాయి నుండి వచ్చిన వారేనని గుర్తు చేశారు. జిల్లాకు చెందిన వ్యక్తి నీలోఫర్ కేఫ్ యజమానిగా మారాడంటే దాని వెనుక ఉన్న శ్రమ అర్థం చేసుకోవచ్చని, ఆయన కూడా అక్కడ పని వారిగా చేరినట్లు తెలిసిందన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల కనుగుణంగా ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని ప్రదర్శించాలన్నారు. అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, నమ్మకం, నిజాయితీ, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అవి ఉంటే ఎక్కడైనా విజయం సాధ్యమవుతుందన్నారు.



జాబ్ మేళా నిర్వహణ కోసం ఆసిఫాబాద్‌కు నూతనంగా వచ్చిన డిఎస్పి సదయ్య ముఖ్య కారకుడని ఆయనను అభినందించారు. జాబ్ మేళా విజయవంతం కావడానికి జిల్లాలోని పోలీసు యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాబ్ మేళాకు జిల్లా నుండి విశేష స్పందన వచ్చింది. పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడంతో పాటు మండల స్థాయిలో నిరుద్యోగులను సమీకరించడంతో పెద్ద ఎత్తున జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. ఐదు రకాల కంపెనీలు 1000పైగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని, పోలీసులు చెప్పడంతో దాదాపు 3000 మంది ఉద్యోగార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఎంపికైన వారికి రూ.15వేల నుండి రూ.45వేల వరకు జీతం ఇస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు కరుణాకర్, సదయ్య, సిఐలు సతీష్, శ్రీనివాస్, రాణా ప్రతాప్, చిట్టిబాబు, ఆర్ఐ పెద్దన్న, అన్ని స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్స్‌కు పాత పద్ధతి ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడి హెల్పర్స్‌కు పాత పద్ధతి ప్రకారమే పదోన్నతులు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదు విభాగంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఐసిడిఎస్ పరిధిలో 9వేల పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కానీ అంగన్వాడి కార్యకర్తలకు గతంలో పదవ తరగతి ఉత్తీర్ణతతో ఎంపిక చేసేవారని, ప్రస్తుతం ఇంటర్ విద్య అర్హత ఉంటేనే ఎంపిక చేస్తామని నిబంధన పెట్టడం సరైనది కాదన్నారు. దీంతో కొత్తగా వచ్చే ఏలాంటి అనుభవం లేని అంగన్వాడి కార్యకర్తలతో పాటు ఎంతోకాలంగా పదోన్నతులకు ఎదురుచూస్తున్న హెల్పర్‌లకు న్యాయం జరగదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎంతోకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న హెల్పర్‌లకు ఎటువంటి నిబంధన లేకుండా పాత పద్ధతి ప్రకారం ఎస్ఎస్‌సీ అర్హతతో పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే పదోన్నతి వయస్సు 50సంవత్సరాలకు పెంచాలని కోరారు.

సస్పెండ్ చేయాలని ఆదేశించడం సరైనది కాదు

అంగన్వాడి హెల్పర్స్ తమ సమస్యలను చెప్పుకోవడానికి వినతిపత్రం ఇస్తే కలెక్టర్ ఎందుకు రోడ్డుమీదికి వస్తున్నారని అనడం, అలాగే డీడబ్ల్యుఓకు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన హెల్పర్స్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరైనది కాదని సురేష్ అన్నారు. సమస్యలు చెప్పుకోవడానికి ప్రజా ఫిర్యాదుల విభాగం ఉందని, ఈ మేరకు శాంతియుతంగా న్యాయం చేయాలని నిరసన తెలిపిన అంగన్వాడీ హెల్పర్స్‌పై బాధ్యతరహితంగా కలెక్టర్ ఓ తప్పుడు నిర్ణయానికి రావడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒకవేళ ఇదే జరిగితే మరుసటి రోజు నుండి మండల కేంద్రాల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.పోశెట్టి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ. రాజమణి, కార్యదర్శి బి.లలిత, కోశాధికారి శైలజ, వెంకటలక్ష్మి, భాగ్య, దేవిక, లావణ్య, శ్రావణి పాల్గొన్నారు.

బేల మార్కెట్ యార్డ్‌ను సపరేట్‌గా ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో అన్ని సౌకర్యాలున్నందున సెపరేట్ చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా నాయకులతో కలిసి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్ సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్ రెడ్డి మాట్లాడుతూ జైనథ్ మండలంలో కలిపి ఉండడంతో రైతులు పంటలు విక్రయించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్లో కొనుగోలు చేయడానికి కాటన్ కమిషన్ ఏజెంట్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా బేల మండల కేంద్రంలో జిన్నింగ్‌తో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కానీ అధికారులు మాత్రం బేల మార్కెట్‌ను జైనథ్‌లో కలిపి ఉంచడంతో ఏదైన పని పడితే రైతులు జైనథ్ మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సపరేట్ చేయాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్ ఖాన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌రావు, ఆదిలాబాద్ ఎస్సీ సెల్ చైర్మన్ చంద్రాల రాహుల్, మావల మండల అధ్యక్షుడు శేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు నవీన్‌రెడ్డి ఉన్నారు.

మల్టీ పర్పస్ వర్కర్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని భీంపూర్ కొత్తపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడలో పిఎం జన్‌మన్ పథకం కింద పివిటిజి కొలాం గిరిజనుల కోసం మంజూరైన మల్టీ పర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం ఎంపిపి కనక మోతుబాయి భూమిపూజ చేశారు. రూ.60లక్షల నిధులతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భూమి పూజ కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మాజీ సర్పంచ్ రాథోడ్ సుభద్ర రామేశ్వర్, ఎంపిటిసి రేణుక దిలీప్, ఐటిడిఏ ఏఈ రాథోడ్ సునీల్, కార్యదర్శి నీరజ్, గ్రామ పెద్ద గణేష్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రం నుంచి రాంపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఉట్నూర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాసంలో గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంపూర్ నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని,



వర్షాకాలంలో రోడ్డు మొత్తం బురదమయంగా మారి చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. రెండు కిలోమీటర్లు మాత్రమే దూరభారం ఉందని బీటీ రోడ్డు వేసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తుకారాం, రఘురాం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.7 లక్షల అంచనా వ్యయంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరి రావు కృషితో మండల కేంద్రానికి మొత్తం రూ.20లక్షలు మంజూరైనట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వొద్నాల రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, సమ్మెట రవి, నగేష్, లింగారెడ్డి, ఎంజలి రాజేందర్, బబ్లు, లింగన్న, రాజేందర్, నర్సయ్య, వినేష్, సురేష్ పాల్గొన్నారు.



ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రూ.6 లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి భూమిపూజ చేసి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకోసం దాదాపు రూ.5కోట్లకు పైగా నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజా పాలన సాగిస్తుందన్నారు. గ్రామంలో ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, యాల్ల పోతా రెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, లక్ష్మీపూర్ ఎంపీటీసీ జైమాల మనోజ్, మహిపాల్ రెడ్డి, మోహన్, అశోక్, నారాయణ, దేవిదాస్, లింగన్న, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, కొండూరి రవి, ముఖీమ్ పాల్గొన్నారు.

మార్చి 1 వరకు అక్షరాస్యత వారోత్సవాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చ్ 1వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను, పుస్తకాలను ఎల్డీఎం, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. బ్యాంకులు, విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని తెలిపారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉదయం 7గంటలకు 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, బ్యాంకర్లు అందరూ హాజరు కావాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కే.భాస్కర ప్రసాద్ సూచించారు. అలాగే 28న ఉదయం 11 గంటలకు ఆర్థిక అక్షరాస్యత శిబిరాన్ని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

- జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని లక్కిషా బంజారానగర్ (పాత ఉట్నూర్)లో శ్రీ అభయాంజనేయ విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెడ్పీ చైర్మెన్‌ను, ఎమ్మెల్యేని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ, నీటి సమస్యలు ఉన్న వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. వెంటనే వాటిని పరిష్కరించి ప్రజలకు మేలు జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాథోడ్ భీంరావ్ నాయక్, కారోబారి పవార్ కృష్ణ, రాథోడ్ ఉత్తం, రాథోడ్ రవీందర్, జాధవ్ అమృత్‌రావ్ ఆలయ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శిలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాందా(టి), పొచ్చెర, గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లు, మురికి కాలువ పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం కింద గ్రామస్తులకు పని కల్పిస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో పాలకులు తమకు ఓట్లు రాని గ్రామాలను ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తూ, వారిపై కక్ష సాధింపు చర్యలుగా అభివృద్ధి పనులు అన్నిటిని నిలిపివేసిన ఆచారం ఉండేదన్నారు. కాని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి రూ.10 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. ఈ పనులకు గాను పరిపాలన అనుమతులు వచ్చేసాయన్నారు. ఈ పనులన్నీ కూడా మార్చి నెలలో పూర్తయ్యే విధంగా చూస్తానని అన్నారు. గ్రామాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్న తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, భూమన్న, చిక్కాల దత్తు, శ్రీనివాస్, లాలా మున్న, ఆశన్న, జోగు రవి, అభినవ సర్దార్, వేదవ్యాస్, సత్యం పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రమోషన్ కల్పించాలి

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన
- ప్రమోషన్ వయస్సు పెంచాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ఎసెస్సీ అర్హత ప్రకారం ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత అన్నారు. సోమవారం అంగన్‌వాడీ హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంతకు ముందు సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో 9 వేల అంగన్‌వాడీ ఉద్యోగుల పోస్టులు ఖాళీ ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించడం సంతోషమన్నారు. కానీ ఇదే సమయంలో అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్ సౌకర్యం, విద్యార్హత ఎసెస్సీ ఉన్న దానిని ఇంటర్‌కు మార్చారని, దీనివల్ల అనేక సంవత్సరాల తర్వాత వస్తున్న ఖాళీ పోస్టుల భర్తీకి ప్రమోషన్ సౌకర్యానికి ఎక్కువమంది అంగన్‌వాడీ హెల్పర్లు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం చేసిన నిర్ణయానికి రాష్ట్రంలోని అంగన్‌డీ హెల్పర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. ఇందులో సగం మంది అంగన్‌వాడీ హెల్పర్లు గత 45 సంవత్సరాలకు పైగా పని చేస్తున్నారన్నారు. వీరికి గతంలో ఎసెస్సీ అర్హత ప్రకారం టీచర్ ప్రమోషన్ సౌకర్యం ఉండేదని గత ప్రభుత్వం 2022 డిసెంబర్‌లో విద్యార్హతను ఇంటర్‌గా మార్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర అనేక రాష్ట్రాల్లో ఎసెస్సీ అర్హత ప్రకారమే హెల్పర్లకు ప్రమోషన్స్ ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో 4 వేల మినీ అంగన్‌వాడీ టీచర్‌లను ఎలాంటి విద్యార్హత కండీషన్ లేకుండా మెయిన్ టీచర్స్‌గా గుర్తించి, వారికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, పాత పద్ధతి ప్రకారమే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, డి.సునీత, అంగన్‌వాడీ హెల్పర్స్ లక్ష్మీ ప్రియాంక, గంగమ్మ, యోగిత, విజయలక్ష్మి, అనిత ప్రియాంక పాల్గొన్నారు.

మార్చ్ 3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- 0-5 పిల్లలు ప్రతీ ఒక్కరికీ పోలియో చుక్కలు వేయాలి
- జిల్లాలో 77,155 మంది చిన్నారులు
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3నుంచి మూడు రోజుల పాటు అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదేండ్ల లోపు పిల్లలకు దేశవ్యాప్తంగా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 0-5 పిల్లలు ప్రతీ ఒక్కరికీ పల్స్ పోలియో చుక్కలు వేసేలా ముఖ్యంగా స్లమ్ ఏరియాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా పోలియోకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వార్డులలో డప్పు చాటింపు వేయించి, అర్హులైన పిల్లలను గుర్తించి మార్చి 3న ఆదివారం నాడు అందరూ పల్స్ పోలియో చుక్కలు వేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. 3న ఆదివారం కావడంతో సెలవుదినంగా అనుకోవద్దని, అంగన్‌వాడీ టీచర్స్, సూపర్‌వైజర్‌లు అందుబాటులో ఉండి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు.

అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి...

జిల్లాలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, అపుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులు 77,155 మంది ఉన్నారని తెలిపారు. అర్బన్ ఏరియాలో 81, రూరల్ ఏరియా లో 420, ట్రైబల్ ఏరియాలో 301 మొత్తం 802 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళ సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుకబట్టీలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 3న పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం అనంతరం మరుసటి, రోజు 4, 5 తేదీలలో రెండు రోజులు ఇంటింటి సర్వే నిర్వహించి, పోలియో చుక్కలు వేసుకోని వారికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, సంబంధిత శాఖాధికారులు

గ్రామస్తుల సమిష్టి కృషితోనే ఆలయ నిర్మాణం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వివిధ పార్టీల నాయకులు

నవతెలంగాణ-తాంసి

గ్రామస్తులు కులమతాలకు అతీతంగా సమిష్టి కృషితో రామాలయ మందిరం నిర్మాణం పూర్తి చేసుకోవడం గొప్ప విషయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామస్తులను అభినందించారు. సోమవారం విగ్రహ ప్రతిష్టాపనకు ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, జోగు రామన్న, మాజీ ఎంపీ గోడం నగేష్, టీపీసీసీ మాజీ కార్యవర్గ సభ్యురాలు గండ్రత్ సుజాత హజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిలను ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు పలు భక్తి మార్గం ప్రవచనాలను చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక కోటి ఎండోమెంట్ నిధులతో పాటు దాతల విరాళాలతో రామ మందిరం నిర్మాణం చేపట్టారని అన్నారు. గ్రామస్తులందరూ పార్టీలకు కుల మతాలు అతీతంగా సమిష్టిగా ఇంత పెద్ద ఆలయాన్ని నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడిచి, చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడు గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రామాంజనేయ ప్రతిష్టాపనలో పాల్గొన్నారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానందం ఎంపీటీసీ సంతోష్, గ్రామ ప్రముఖులు నారాయణ, మహేందర్, అశోక్, బజరంగ్, శేఖర్ ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనే తమ లక్ష్యం

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బహుజన మహనీయుల ఆశయ సాధనే మా జీవిత లక్ష్యమని పూలే దంపతుల అడుగుజాడల్లో నడుస్తూ సమాజాన్ని చైతన్యపరిచి మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాల నుంచి బయటపడేలా చేస్తామని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్ సత్యశోధక్ రఘునాథ్ ధోక్ పూణే, ప్రముఖ సాహితీవేత్త మధు బావల్కర్‌లతో కలిసి మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు 1873వ సంవత్సరంలో సత్యశోధక సమాజాన్ని స్థాపించారని అన్నారు. ఆ సమాజ నియమాలకు అనుగుణంగానే సత్యశోధక వివాహాలు జరిపించడం ప్రారంభించామని తెలిపారు. ఇలాంటి వివాహాలను బహుజన కులాల్లో ఉన్న అందరూ పాటించి మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను కేవలం చెప్పడమే కాకుండా తమ ఇద్దరు పిల్లల వివాహాలు సత్యశోధక పద్ధతిలోనే జరిపించానని సుకుమార్ పెట్కులే అన్నారు.

ఈ కార్యక్రమానికి మహారాష్ట్రలోని దాదాపు పది జిల్లాల నుంచి అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నుంచి ప్రముఖులు హాజరయ్యారు. పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించి, బహుజన మహనీయుల అడుగుజాడల్లో నడవడానికి ముందుకు వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయాలని ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ రమేష్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, మొక్కను అందించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి మాణిక్‌రావు, ఉపాధ్యక్షులు రాము, ట్రెజరర్ జాదవ్ వసంతరావు, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, రాము, రవికిరణ్, చావన్ సేవాదాస్, డివిజన్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : డీపీఎం నరేందర్



నవతెలంగాణ-నార్నూర్

ఐకేపీ మహిళ సంఘాలు రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం బి.నరేందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో సీసీలు, వీఓఏ, మహిళ సంఘాలతో సమావేశం నిర్వహించారు. తీసుకున్న రుణాలను మహిళ సంఘాలు సక్రమంగా చెల్లిస్తే కొత్తగా రుణాలను మంజూరు చేస్తామని అన్నారు. రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. సమావేశంలో ఏపీఎం మైసా రమేష్, సీసీలు జాదవ్ కిషన్, సంతోష్, రేవయ్య, శ్రీరామ్, చంద్రకాంత్, సత్యశీలా, సిబ్బంది సీహెచ్ తుకారాం, ఆయా గ్రామాల వీఓఏలు, మహిళ సంఘాలు సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జీని కలిసిన జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్సీని పార్టీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్ వెళ్లిన నాయకులు గాంధీ భవన్‌లో కలిసి ఆదిలాబాద్ నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను ఆమెకు వివరించారు. ఆమెను కలిసిన వారిలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన శ్రీకాంత్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్ ఖాన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌రావు, ఆదిలాబాద్ ఎస్సీ సెల్ చైర్మెన్ చంద్రాల రాహుల్, మావల మండల అధ్యక్షుడు శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

పేదల ఆకలిని తీర్చేడానికే బొజ్జన్న బువ్వ

- మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్



నవతెలంగాణ-ఉట్నూర్

సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య లక్ష్యమని మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదానం నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఈ అన్నదానం ఉంటుందని తెలిపారు. ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ నిసార్, వెడ్మ బొజ్జు యువసైన్యం సభ్యులు మెస్రం నగేష్, అక్షయ్, సాయి, కాంబ్లే సునీల్, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com

జాబ్‌మేళాకు విశేష స్పందన



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు మండలం నుండి సుమారు 150 మంది యువతీ, యువకులు పాల్గొన్నట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగం లేక పెడదారి పడుతారనే ఉద్దేశ్యంతో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు, ఈ మేళాలో వివిధ రంగాలకు చెందిన సుమారు 50 బహుళజాతి కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఇంటి వద్దనే ఉంటున్నామని, పోలీసులు ఈ జాబ్‌మేళాను నిర్వహించడం సంతోషకరమైన విషయమని, ఎస్పీకి రుణపడి ఉంటామన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని గంగాపూర్ (అంబగట్ట) గ్రామంలో ఆరె కులస్థులు ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ చాప్లే రోజా సుధాకర్ మాట్లాడుతూ చత్రపతి శివాజీని స్ఫూర్తి తీసుకొని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబగట్ట గ్రామస్తులు బింకరి భీమయ్య, ఒడిల మైశయ్య, ఎలుమల రాజన్న, డబ్బుల సంతోష్, ఆకిరెడ్డి రామ చంద్రు పాల్గొన్నారు.

మహాశివరాత్రి కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో మార్చి 8న నిర్వహించనున్న శివరాత్రి శివ కళ్యాణం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివ కళ్యాణానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు రామగిరి అశోక్, ఆలయ అధ్యక్షులు అక్కు విజయ్, ప్రధాన కార్యదర్శి రాపర్తి నరసింహా స్వామి, గౌరవ అధ్యక్షులు రాపర్తి శంకర్, కార్యదర్శి రాపర్తి నాగరాజు, నాయకులు శేఖర్, అశోక్, సత్యనారాయణ, గణేష్, రమేష్ పాల్గొన్నారు.

దుమ్మూ, ధూళితో ఇబ్బందులు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామ రోడ్డు నిర్మాణానికి కంకర వేసి పనులు చేపట్టకపోవడంతో కమానకు వెళ్లే రహదారిపై దుమ్మూ, దూళీతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నెలలు గడుస్తున్నా రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతుంది. రాత్రి వేళల్లో రోడ్డుపై నడవాలంటే అనేక కష్టాలకు గురికావాల్సి వస్తుందని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తయ్యే విధంగా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రజాసేవే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమాజంలో అసమానతలు లేకుండా పరిపాలించిన ఒకేఒక పార్టీ కాంగ్రెస్ అని సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చీలపెల్లి, పారిగాం గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలు అమలవుతున్నాయని, రానున్న రోజుల్లో మిగతా గ్యారెంటీలు అమలుచేయడానికి సిద్ధంగా ఉందన్నారు. సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారని, రాబోయే కాలంలో దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలాగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి మాట్లాడుతూ మండలంలో మండల, పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని, ప్రతి గ్రామంలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కర్తవ్యాన్ని నిర్వహించాలని సూచించారు.

డీలర్లు వివరాలు అందజేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లు బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, ఆధార్ నెంబర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కానీ లేదా సెల్ నెంబర్ 9581237494కు వాట్సప్ చేయాలని రెవెన్యూ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే చాలామంది పంపించకపోవడంతో డిసెంబర్ నెల డీలర్లకు వచ్చే కమీషన్ రిలీజ్ కావడంలేదని, ఇప్పటికైనా డీలర్లందరు వారి వివరాలను అందించాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుల వేతన వెతలు

- జీతాలు అందక పస్తులు
- ఇబ్బంది పడుతున్న పంచాయతీ సిబ్బంది
- అప్పు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వైనం

తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న వీరికి నెలనెల వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాక పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు.



నవతెలంగాణ-కెరమెరి

పారిశుధ్య కార్మికులు గ్రామపంచాయతీలోని గ్రామాల్లో వీధులు శుభ్ర పర్చడం, మురికి కాలువలు తీయడం మొదలుకొని వీధి దీపాలు వేయడం, నర్సరీలో మొక్కలు పెంచడం, క్రిమిటోరియం గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయటం లాంటి పనులు నిర్వహిస్తుంటారు. జిల్లాలోని 15మండలాల పరిధిలో 334 గ్రామ పంచాయతీల్లో సుమారు 850 మంది పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో కారోబార్‌లు, ట్రాక్టర్ డ్రైవర్‌లు, పంపు ఆపరేటర్లు, వాటర్ సప్లై కార్మికులు, పారిశుధ్య కార్మికులున్నారు. వీరికి ప్రతినెల 1న జీతభత్యాలు చెల్లించాలి. గత ప్రభుత్వం మొన్నటి వరకు ప్రతి నెల వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేసింది. దీంతో వచ్చిన వేతనంతో కుటుంబ పోషణ, ఇతర అవసరాలు తీర్చుకునే వారు. ఎన్నికల్లో గత ప్రభుత్వం ఓడిపోవడం, నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ నిధులు విడుల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల వేతనం కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడు నెలలుగా అందని వేతనాలు

ఒక నెల జీతం అలస్యమైతేనే ఉద్యోగులు తంటాలు పడాల్సి వస్తుంది. అలాంటిది పొట్ట కూటి కోసం భరించలేని దుర్గంధంలో పని చేస్తూ, చాలీచాలని వేతనాలతో కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్న కార్మికులకు డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పెరిగిన ధరలతో పోల్చితే ప్రభుత్వం చెల్లించే అరకొర వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు అనారోగ్యాల బారిన పడితే వారి బాధలు వర్ణనాతీతం. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తమ బాదలు తెలుసుకొని వేతనాలు నెలనెల సక్రమంగా అందించేలా చూడాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారం

కూకటికల నగేష్, పారిశుధ్య కార్మికుడు, కెరమెరి



మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. పిల్లలకు పాలు, బిస్కెట్ల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టి పరిశుభ్రంగా ఉంచుతున్న తామ సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెటనే వేతనాలు విడుదల చేయాలి.

జీతాలు ఇవ్వకుంటే బతికేదెట్లా..?

తిరుసుల్ల మల్లేష్, కార్మికుడు



ఓ వైపు పని భారం, మరో వైపు ఆర్థిక ఇబ్బందులు బతుకు కష్టంగా మారింది. చేతిలో చిల్లి డబ్బులు లేక ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. వచ్చే అరకొర వేతనాలు ప్రభుత్వం సక్రమంగా చెల్లించకపోవడంతో పూట గడవని దుస్థితి ఏర్పడింది. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే ఎలా బతికేది. ప్రభుత్వం వెంటనే కార్మికుల జీతాలు ప్రతినెలా చెల్లించాలి.

ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి


రాజేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు



పంచాయతీ కార్మికుల వేతనాలు ప్రతినెల చెల్లించాలి. సక్రమంగా వేతనాలు రాక కార్మికులు కష్టాలు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం నిధులు విడుదల చేసి జీపీకార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేయాల్సి వస్తుంది.

చెక్‌పవర్ లేక ఇబ్బందులు

ఒమర్ హుస్సేన్, జిల్లా పంచాయతీ అధికారి



సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులను పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారులకు చెక్ పవర్ లేకపోవడం, నిధులు లేమితో వేతనాలు చెల్లించలేని పరిస్థితి. ప్రస్తుతం ప్రత్యేక అధికారులకు చెక్ పవర్ ఇస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే పంచాయతీ కార్మికులకి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారి కోసిని సమీపంలో రోడ్డు పూర్తి అధ్వానంగా మారిందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంరావు మాట్లాడుతూ కోసిని నుండి సిర్పూర్(టి) వరకు రహదారి పూర్తిగా గుంతలమయమై అధ్వానంగా మారిందన్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకుల పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు జేసీబీతో తవ్వి మరమ్మతులు చేస్తామని చెప్పి పట్టించుకోనందున రోడ్డుపై గుంతలు ఏర్పడి, దుమ్ము ధూళి పైకి లేస్తోందన్నారు. ప్రయాణికులకు దుమ్ము కళ్లలో పడి కళ్ల సమస్యలు, దుమ్ము దూళి పీల్చుకొని ఊపిరితిత్తుల సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వాహనదారులు ప్రయాణిస్తున్న సమయంలో గుంతలు తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 15 రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ టౌన్ ఇన్‌చార్జి షబ్బీర్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మనోహర్, తన్నీరు పోచం, దాసరి నరేందర్, రేణుకుంట్ల శ్రీనివాస్, మెరుగు రాజేష్, షబ్బీర్ హుస్సేన్, కాశిపాక రాజు, గోగార్ల శంకర్, మరుపాక శోభన్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి యువత సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించడానికి ప్రయత్నించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ ఆవరణలో అధికారికంగా సోమవారం నిర్వహించిన సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే కోవలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మందికి పైగా బంజారాలు ఉండి అధికారిక వేడుకకు అతి తక్కువగా హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘం ప్రతినిధులు పెట్టిన డిమాండ్ల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఫిబ్రవరి 16న వేడుకలు జరిగే విధంగా అందరు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జయంతి వేడుకలు ప్రారంభించామని, వేడుకలకు ఇచ్చే నిధులు మరింత పెంచాల్సిన అవసరముందన్నారు. జిల్లా కేంద్రంలో సేవాలాల్ భవన నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పేదలకు సాయం చేయాలని చెప్పిన సేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం విభిన్న మతాలకు నిలయమన్నారు. అటువంటి మతాలను జాతులను విచ్ఛినం చేయడానికి గతంలో అనేకమంది ప్రయత్నం చేశారని అన్నారు. జాతులను ఐక్యం చేసేది సంస్కృతని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని జాతులపై ఉంటుందన్నారు. బంజారా నాయకులు పెట్టిన డిమాండ్ పరిష్కారం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ యువత దురలవాట్లకు పాల్పడకూడదని సేవాలాల్ బోధించాడని గుర్తు చేశారు. బంజారాలు ఎక్కువగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారని వారి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నప్పటికీ మరింత ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సేవాలాల్ జయంతిని రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ఆశావాహి అభ్యర్థి అభినవ్ సర్దార్ శకావత్ మాట్లాడుతూ సమాజంలో స్వార్థం, ఈర్ష్యా పెరిగిపోతున్నాయన్నారు. ఎవరైనా మంచి చేసేటప్పుడు వారికి చేయూత అందించాలన్నారు. బంజారా సమాజం బాగుపడాలంటే ఓటుతోనే సాధ్యమని ఓటును అమ్ముకోవద్దన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై తీజ్ లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సభ ప్రాంగణంలో గోద్ బండార్ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవి నాయక్, ప్రధాన కార్యదర్శి బదావత్ శివప్రసాద్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మరాం నాయక్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ రామారావు, నాయకులు రాథోడ్ నారాయణ, రవీందర్, గోపాల్ నాయక్, డీటీడీఓ రమాదేవి, జిల్లాలోని బంజారా సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 10,423 మంది విద్యార్థులకు 19 కేంద్రాలు
- ఒక్క నిమిషం నిబంధన వర్తింపు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈనెల 28 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే పరీక్షా కేంద్రం సమీపంలోని పోలీస్ స్టేషన్‌లకు ప్రశ్న పత్రాలు సరఫరా కాగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్నిచోట్ల అవసరమైన మౌలిక వసతులు కల్పించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లాలో ఈనెల 28 నుండి వచ్చే నెల 16వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 19 సెంటర్లు ఏర్పాటు చేసి నిర్వహణకు ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరిండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించారు. ప్రశ్నపత్రాల నిర్వహణ కోసం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ కేంద్రాలలో కస్టోడియన్‌లను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందిని కూడా నియమించారు.

19 కేంద్రాల్లో 10,423 మంది విద్యార్థులు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు 10423 మంది హాజరు కానున్నారు. మొదటి సంవత్సరంలో 5423 మంది, ద్వితీయ సంవత్సరంలో 5003 మంది ఉన్నారు. వీరి కోసం 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, 2 ప్రయివేట్ కళాశాలల్లో, 2 ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ శాఖ కళాశాలలలో, 1 ఎంజేపీ, 1 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలున్నాయి. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం రెండు సెంటర్లను అదనంగా పెంచారు.



ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ లో పేపర్లు భద్రపరుస్తున్న సిబ్బంది

ఒక్క నిమిషం నిబంధన వర్తింపు

పోటి పరీక్షల మాదిరిగానే ఇంటర్మీడియట్ పరీక్షలకు కూడా ఒక్క నిమిషం నిబంధన వర్తించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. విద్యార్థులు 9 గంటల కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 8 గంటల నుండి పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించనున్నట్లు వివరించారు.

మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత

కొన్ని పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ కళాశాలల్లో ఏర్పాటు చేయగా వాటిలో విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా మౌలిక వసతులు కల్పన కోసం ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీటితో పాటు మూత్రశాలలు ఇతర ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

నైతం శంకర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి



జిల్లాలో 19 సెంటర్లు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆయా సెంటర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి చేరే విధంగా బస్సులు ఉండేలా ఆర్టీసీ అధికారులను కోరాం. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

జగదీష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రానికి చెందిన యువ నాయకుడు బీమనాగుల జగదీష్ స్మారక క్రికెట్ టోర్నమెంటును సోమవారం ఆయన సోదరులు బీమనాగుల మహేష్, విఘ్నేష్, పరమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యువ నాయకుడిగా జగదీష్ చేసిన సేవలను కొనియాడారు. దహెగాంకు జగదీష్ లేని లోటు తీర్చలేనిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పలువురిని స్మరించుకోవడంతో పాటు యువతలో మంచి స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడానికి దోహదపడుతాయన్నారు. ఈ టోర్నీ గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, గెలుపొందిన ప్రథమ జట్టుకు రూ.21 వేలు, రన్నర్ టీంకు రూ.11 వేలు నగదుతో పాటు జ్ఞాపికలు అందించనున్నట్టు పేర్కొన్నారు.

సేవాలాల్ సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందనీయమని కొనియాడారు. తన బోదనల ద్వారా బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు ఆయన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ బండి సదాశివ్, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక మల్లికార్జున నగర్‌లో నివాసముంటున్న గుడిసె కొమురయ్య ఇటీవల కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయింది. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అవసరాల నిమిత్తం వారి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బి భూమేష్, అధ్యక్షుడు బి లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి కె అశోక్, ఉపాధ్యక్షులు ఏ కుమార్, కోశాధికారి టీ సురేష్, సభ్యులు బి సంపత్, కె సంపత్, యస్ మహేందర్, ఎస్ మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల మండలం గరిమెళ్ళ శివారులో గల ప్రభుత్వ భూములను అక్రమార్కుల నుంచి కాపాడాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్ పాషా కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాలలోని గరిమెళ్ళ శివారులో సర్వేనెంబర్ 707,708లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో వ్యవసాయదారులు తమ పొలాలలో వ్యవసాయ పనుల కోసం, వ్యవసాయ అవసరాల కోసం ఎడ్ల బండిని వెళ్ళడానికి ఈ యొక్క దారిని ఉపయోగించేవారని తెలిపారు. ఈ దారి వెడల్పు కేవలం 6 నుంచి 7 ఫీట్లు మాత్రమే ఉండేదని, దీన్ని ఆసరాగా చేసుకొని హరిణి రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థ వారు అక్రమంగా 30 నుంచి 40 ఫీట్ల రోడ్డు వేసుకొని ప్రజలను మోసం చేస్తూ విల్లాలు అమ్ముతూ డబ్బు దోచుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొంటూ రాజేందర్, మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్లు అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ హెల్పర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. గతంలో ప్రభుత్వం పదవ తరగతితో ప్రమోషన్లు ఇచ్చిందని, కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్లకు ఇంటర్మీడియట్ అర్హత పెట్టడం సరైనది కాదని అన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్నటువంటి వేలాది మంది అంగన్‌వాడీ హెల్పర్లు నష్టపోతారని, ఇప్పటివరకు విద్య అర్హత ఎస్ఎస్సీ పెట్టి ఉన్నపలంగా రెగ్యులర్ ఇంటర్ ఉండాలంటే ఎలా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర అనేక రాష్ట్రంలో ఎస్ఎస్సీ ప్రకారం హెల్పర్లకు ప్రమోషన్ ఇస్తున్నారు. పాత పద్ధతి ద్వారానే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలు పెంచాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలన్నారు. జీతంలో సగం పెన్షన్, ఉద్యోగ భద్రత, సౌకర్యాలు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న కేంద్రాలను తొలగించి, కొత్త నిర్మాణాలు చేపట్టాలని, బెనిఫిషర్లకు అందుబాటులో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రకాష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు, హెల్పర్లు నిర్మల, అమృత, స్వాతి, విరోనిక, రాజేశ్వరి, స్వరూప, స్వాతి, లావణ్య, స్వరూప మధులత, అనూష, పద్మ, స్రవంతి, కౌసల్య, మీనాక్షి, శారదా పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు

రైతాంగ వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతాంగం పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్తున్న హర్యానా, పంజాబ్, ఇతర రాష్ట్రాల రైతులపై ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మోడీ ప్రభుత్వం పోలీసులతో రైతులపై లాటిఛార్జ్ చేయడం, కాల్పులు జరపడం, బాష్ప వాయువులు ఉపయోగించడం వల్ల ఇప్పటికే ఇద్దరు రైతులు చనిపోయారని వందలాదిమంది క్షతగాత్రులు అయ్యారని, ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ రైతులకు గత పోరాటంలో ఇచ్చిన హామీ ప్రకారమైన వెంటనే మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎస్‌కేఎస్ ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆర్కే ఓసీపీ గనిలో హెవీ ఎర్త్ మూవింగ్ మిషినరి ఎంపిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓసీపీ గనిలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హెవీ ఎర్త్ మూవింగ్ మిషనరీ(హెచ్‌ఈఎంఎం) మజ్దూర్ కేటగిరి-02కి ఎంపిక పరీక్ష నిర్వహించారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఈఎంఎం మజ్దూర్లకు మూడు సంవత్సరాల పనిలో అనుభవం ఉన్న వారికి ఈ ఎంపిక పరీక్ష నిర్వహించామని తెలిపారు. మొత్తం 6 ఉద్యోగాలకు 5 దరఖాస్తులు వచ్చాయని, నలుగురు ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఒకరు గైర్హాజరు అయ్యారని నలుగురికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, డీవైపీఎం సత్య బోస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి మహేందర్ పాల్గొన్నారు.

అతిరుద్ర మహా యాగంలో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న అతి రుద్రయాగ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. సోమవారం అతిరుద్ర యాగంలో శివపార్వతిలను దర్శించుకొని, వేద పండితులతో ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఇలాంటి యాగం చేయటం ఎంతో శుభసూచకమని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ యాగంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని, దేవుని కృప, ఆశీస్సులు పొందాలని పేర్కొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ చింతా సువర్ణ, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్,మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం వికాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

నవతెలంగాణ-జన్నారం

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలోని క్రషర్‌ను తొలగించాలి

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం కిష్టంపేట్ గ్రామ శివారు సబ్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన ఇసుక, సిమెంట్ క్రషర్‌ను తొలగించాలని చెన్నూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుశీల్ కుమార్, చింతల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గతంలో పలుమార్లు మండల పరిధి అధికారులకు పిర్యాదు చేసినట్లు పేర్కొంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేశారు. జనవాసాలకు సమీపంలో గల ఈ క్రషర్ నుండి వెలువడిన దుమ్ము ధూళీతో స్థానికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిర్యాదులో పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రజావాణిలో పలుమార్లు పిర్యాదు చేయడంతో పాటు స్థానిక అధికారులకు స్థానికులు ఇబ్బందులు వివరించినా ఫలితం లేకుండాపోయిందని పేర్కొన్నారు. క్రషర్ ద్వార వెలువడుతున్న దుమ్ము ధూళితో సమీప కాలనీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారని, శ్వాసకోష సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున అధికారులు తగు విధంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్ర్రాల్లో సమయ పాలన పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో సమయపాలన పాటించాలని స్థానిక ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్ ఆదేశించారు. సోమవారం టేకుమట్ల గ్రామ పంచాయతిని సంధర్శించిన ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలు కేంద్రాలకు వచ్చే విధంగా చూడాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసిన ఎంపీడీఓ గ్రామ పంచాయతి పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం పూర్తిలోపు గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనుమతులు పొందని లేఅవుట్స్ ఏర్పాటు పట్ల నిక్కచ్చిగా వ్యవహరించాలని గ్రామ పంచాయతి కార్యదర్శిని ఆదేశించారు.



ఆత్మవిశ్వాసంతో మంచి మార్కులు సాధించాలి

- జిల్లా విద్యాధికారి యాదయ్య
- పదో తరగతి విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కాసిపేట

పదో తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ అధ్యక్షతన మండలంలోని అన్ని పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు వంద శాతం ఉత్తీర్ణత, అత్యధిక జీపీఏ సాధన ధ్యేయంగా అవగాహన సదస్సు, ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ యాదయ్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు భయం లేకుండా చదువుకోవాలని, ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్, ఆయా సబ్జెక్టుల నిపుణులతో విద్యార్థులకు టైం మేనేజ్మెంట్, స్ట్రెస్ మేనేజ్మెంట్, పరీక్ష పత్రం, పరీక్షల పట్ల భయం పోగొట్టడం, మంచి ఉత్తీర్ణత సాధించడం మొదలైన అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృతి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, సెక్టోరల్ ఆఫీసర్ చౌదరి, డీసీఈబీ భీంరావు, మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్, మోటివేటర్ మహిపాల్, మోడల్ ప్రిన్సిపాల్ అండె నాగమల్లయ్య, హెచ్ఎంలు సాంబ మూర్తి, సుధాకర్ నాయక్, సబ్జెక్టు నిపుణులు రమేష్, మధుసూదన్ శర్మ, శఫీయొద్దీన్, సతీష్, రాజేశం, చంద్రవాస్, మధుకర్, ఎంపీఓ నాగరాజు, ఉపాధ్యాయులు శాంకరి, అరుణ, రమణారెడ్డి, సీసీఓ రాంబాబు పాల్గొన్నారు.



అర్హులైన పేదలకు రేషన్ కార్డులివ్వాలి



నవతెలంగాణ-జన్నారం

అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని పేదల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేసి పేదల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ప్రతి పథకానికి తెల్ల రేషన్ కార్డును లింకు చెయ్యడం వల్ల పేదలు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కార్డున్న వారి కుటుంబ సభ్యుల పేర్లు కూడ నమోదు చెయ్యలేదన్నారు. మండలంలో పోడు భూములకు హక్కు పత్రలివ్వాలని, హక్కు పత్రలున్న భూముల సాగు చేసుకొనివ్వాలని అన్నారు. ఇంటి స్థలాల కోసం పేదలు ఎన్నో ఏండ్లుగా ఎదిరి చూస్తున్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, రోగ నిర్ధారణ కోసం ల్యాబ్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కనికరపు అశోక్, మండల నాయకులు బుచ్చన్న, ఎస్‌కే అబ్దుల్లా, మగ్గిడి జయ, ఒడిపెల్లి ప్రమీల, రాజన్న, అత్రం రాజు, లింగన్న, భీమక్క, అన్నిబాయి పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ గేట్ ముందు నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు రెండేళ్లకోసారి నిర్వహించాలని, కాని ఐదేళ్లవుతున్నా ఇంకా నిర్వహించలేదన్నారు. ఇప్పటికే యూనియన్లతో డీసీఎల్ మూడు సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఓటర్ జాబితాపై అభ్యంతరాలు చెప్పడం అన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహించకపోవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అన్ని యూనియన్లు ఎన్నికలు నిర్వహించాలని కోరడం జరుగుతుందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోయం సూరు, ఆడె జంగు, రొడ్డ కిష్టయ్య, మడావి ధర్మరావు, సిడం రాజు, ఆత్రం జంగు, రొడ్డ రవీందర్, రాము, కనక గోవర్ధన్, శ్రావణ్, భీంరావు, శ్రీనివాస్, ఈశ్వర్, సురేశ్, మారుతి, తిరుపతి పాల్గొన్నారు.



ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్న మైనింగ్ అధికారులు

జైపూర్ : ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ తరలింపును నియంత్రిండం కోసం భీమారం, రసూల్‌పల్లి శివారుల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు మైనింగ్ జిల్లా ఇన్‌చార్జి ఏడీ బాలు తెలిపారు. సోమవారం ఉదయం ఎలాంటి ఆధారాలు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న 4 లారీలతో పాటు ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన లారీలతో పాటు ట్రాక్టర్‌ను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు స్వాధీనపర్చినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే సహించేది లేదని, అక్రమ ఇసుక రవాణా నియంత్రించడం కోసం నిఘా నిరంతరం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.

అన్ని రంగాలు అభివద్ధి చేస్తాం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్.
- ముత్యంపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



అన్ని రంగాల్లో మండలాన్ని అభివృద్ధి చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ముత్యంపల్లి క్రీడా మైదానం వద్ద క్రికెట్ టోర్నీ గోవా సూపర్ కింగ్స్ జట్టు జెర్సీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, గిరిజన జేఏసీ జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, ముత్యంపల్లి టౌన్ అధ్యక్షుడు దారవేణి రాజయ్య, రాపర్తి శ్రీనివాస్, నస్పూరి నర్సింగ్, ఉత్తూరి సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, పుర్ర కుమారస్వామి, భారతాని సతీశ్, మంద వెంకటేశ్, దాగం రాజలింగు, మాజీ సర్పంచ్ సంపత్ నాయక్, మూర్తుజా పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్ సమీపంలో ఈ నెల 27వ తేదీ ఉదయం గం11.30ని.లకు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని లంబాడా(ఎస్టీ) కమ్యూనిటీ అధికారులు, ఉద్యోగులకు వేడుకలకు హాజరయ్యేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేయడం జరిగిందని, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సకాలంలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

మార్చి 1న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ముగింపు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో అక్షరాస్యత వారోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ఉదయం 7.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు చేపట్టనున్న 2-కే రన్ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిషత్ ఉపాధ్యక్షున్ని ఎన్నుకోవడం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మద్దికల్ ఎంపీటీసీ మంతెన సమ్మయ్య మధ్యంతరంగా పదవి నుండి వైదొగాల్సి వచ్చింది. ఎన్నికల ఖర్చుల వివరాలు సకాలంలో ఎన్నిక సంఘానికి సమర్పించనందున ఆయన ఎంపీటీసీ పదవి నుండి వైదొలగాల్సివచ్చింది. ఈ కారణంగా భీమారం మండలపరిషత్‌కు ఉపాధ్యక్షున్ని ఎన్నుకోవడం అనివార్యమైంది. మండల పరిషత్ పరిధిలో మొత్తం నలుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఇందులో ఒకరు ఎంపీపీగా ఎన్నిక కాగా మద్దికల్ ఎంపీటీసీ పదవి నుంచి వైదొలగడంతో మిగిలిన ఇద్దరు ఎంపీటీసీ సభ్యుల నుంచి ఉపాధ్యక్షున్ని ఎన్నుకోనున్నారు. ఇక్కడ ఏర్పడిన ఉపాధ్యక్ష ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 28న ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కార్మిక రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-జైపూర్

హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌ను అంతర్జాతీయ కార్మిక రత్న అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ ద్వార అవార్డు అందుకున్న రియాజ్ అహ్మద్‌ను ఆదివారం రాత్రి ఎస్టీపీపీ కార్మికులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, సాయికృష్ణ, సంపత్, నవీన్, దుస్సా అజయ్, మహిళా నాయకులు మల్లిక, కనక లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చి 8, 9 తేదీల్లో వాంకిడి మండల కేంద్రంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టికానంద్, గొడిసెల కార్తీక్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కబడ్డీ పోటీలకు ఎంట్రీ ఫీజు రూ.500గా నిర్ణయించామని, విజేతలకు మొదటి బహుమతి షీల్డ్ తో పాటు రూ.7వేల నగదు, రెండవ బహుమతి రూ.5000 అందజేయనున్నట్లు తెలిపారు. యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాల కొరకు 7702664187, 6302363282, 8919069178, 9866467112 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వరుసగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..నాందేడ్‌కు చెందిన రమేష్ శ్యామ్‌రావ్, కిన్వట్‌కు చెందిన సూరజ్ రఘునాథ్ కాంబ్లే ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతంలో రిమ్స్, ఎస్బీఐ బ్యాంక్ దగ్గర ద్విచక్రవాహనాలు దొంగలించారు. సోమవారం ఎన్టీఆర్ చౌక్‌లో మరో ద్విచక్రవాహనం దొంగతనం చేస్తుండగా అనుమానంగా కనిపించిన వారిని ఎస్ఐ అబీబ్ ఖాన్ పట్టుకొని మందలించగా నేరం ఒప్పుకున్నన్నారు. వారి వద్ద నుండి మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కేసుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కేసుల పరిష్కారానికి తగిన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా జడ్జి కె.కరుణకుమార్ అన్నారు. సోమవారం కోర్టు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూసంబంధిత, క్రిమినల్ కేసుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జైలులో ఉన్న ట్రయల్ ఖైదీల కింద ఉన్న కేసులలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలన్నారు. క్రిమినల్ కేసులపై సాక్షులు, నిందితులు, విచారణ అధికారులు కోర్టులకు హాజరు కావాలన్నారు. పెండింగ్ కేసులు, 2020కి ముందు కేసుల పురోగతి, అలాగే గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తదుపరి చర్యలపై చర్చించారు. కోర్టు భవనాలు, నిర్మల్‌లో న్యాయాధికారులకు నివాస గృహాల నిర్మాణానికి అంచనాల ప్రతిపాదనలు, బాసరలో జ్యుడీషియల్ గెస్ట్ హౌస్ నిర్మాణం, జిల్లా కోర్టు భవనం విద్యుద్దీకరణ పనులు వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, డిఆర్ఓ గంగయ్య పాల్గొన్నారు.

రూ.5కోట్లతో అదనపు తరగతి గదులకు భూమిపూజ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో రూ.5కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని నందిగామ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన రూ.10లక్షలతో సిసి రోడ్డు పనులను ఎంపీ సోయం బాపురావు, జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్‌తో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవి రమణ, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌రావు, ప్రతాప్, తెలంగాణరావు, వసంత్, సురేందర్, రాము, బిజెపి నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, అభిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఎస్సీ, బీసీ స్టడీ సర్కిల్ మాదిరి గిరిజన విద్యార్థులకు ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు సలాం వరుణ్, రాథోడ్ సందీప్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్టీ స్టడీ సర్కిల్ కోసం గతంలో ఈ విషయాన్ని రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విద్యార్థులకు ఎస్టీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసి గిరిజన విద్యార్థి నిరుద్యోగ యువతతో కలిసి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గోపాల్, నారిష్, లోకేష్, సునీల్, కేశవ్, హరీష్, శంకర్ పాల్గొన్నారు.



‘ఎస్టిమేట్ ప్రకారం లేనిరోడ్డు మాకొద్దు’

- ఆదివాసీ గిరిజన గ్రామ ప్రజల నిరసన
- ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తాం

నవతెలంగాణ-కౌటాల

ఎస్టిట్ ప్రకారం లేని రోడ్డు మాకద్దంటూ మండలంలోని తుమ్మిహేటి గిరిజన గ్రామ ప్రజలు ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుండి పీపీనగర్ వరకు, పీపీనగర్ నుండి జనగాం వరకు సుమారుగా రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేయడానికి ఎస్టిమేట్ ఇచ్చారు. అందుకు విరుద్ధంగా సంబంధిత గుత్తెదారుడు అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభించి జనగాం వరకు రోడ్డు పనులను చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుండి అంబేద్కర్ వరకు సుమారుగా 400 మీటర్లు రోడ్డును వదిలిపెట్టి వేశారు. ఈ విషయంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గ్రామాలు ఎప్పుడు వెనుకబడి ఉండడమేనా..? అభివృద్ధి చెందేదెప్పుడని మాజీ సర్పంచ్ పత్రు పేర్కొన్నారు. అధికారులు సైతం ఆర్అండ్‌బీ రోడ్డు నుండి జనగాం వరకు అని చెప్పి ఇప్పుడు ఈ మధ్యలో సిమెంటు రోడ్డు ఉందని, అంబేద్కర్ రోడ్డు పనులను ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. 20 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకొని ఉందని, ఈ రోడ్డును తీసేసి రోడ్డు వెడల్పు చేసి, ఎస్టిమేంట్ ప్రకారం ఆర్అండ్‌బీ రోడ్డు నుండే పనులు చేపట్టాలని, లేనిపక్షంలో ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. హేటి గ్రామంలో ఇదే రోడ్డుపై మధ్యలో విద్యుత్ స్తంభం ఉందని, దానిని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు రోడ్డు మధ్యలో నుండి విద్యుత్ స్తంభాన్ని తీసి ప్రక్కకు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించగా సీసీ రోడ్డుపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారని, దానిని కూడా సీసీ రోడ్డుపై నుండి వేయడమా తొలగించి వేయడమా అనేది సంబంధిత అధికారుల నుండి స్పష్టత రావాల్సి ఉందన్నారు. జేఈ బద్రోద్దిన్‌ను సంప్రదించగా వాస్తవానికి ఎస్టిమేట్‌ఉన్నదైతే ఆర్అండ్‌బీ రోడ్డు నుండి జనగాం వరకు అలాగే వేయాలి కానీ సీసీ రోడ్డు ఉన్నందున అక్కడి నుండి వేయడం జరుగుతుందని, దీనిపై సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. శ



ఎస్టిమేట్‌లో లేని రహదారి ఇదే



చెరువు శిఖం భూమిలో కబ్జా చేసుకొని నిర్మించుకున్న ఇల్లు

శిఖం భూమి కబ్జా

తుమ్మిహేటి చెరువు శిఖం భూమిని కబ్జా చేసుకొని శివాజీ చౌరస్తా వద్ద రోడ్డును ఆనుకొని ఇల్లు కట్టడంతో చిన్న వాహనం కూడా అక్కడి నుండి లోపలికి పోలేని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పు చేయాలని, ఆర్అండ్‌బీ రోడ్డు నుండే రోడ్డు పనులను కొనసాగించాలని కోరుతున్నారు.

తలకాయ లేని రోడ్డు మాకొద్దు

పోర్తెటి పత్రు, మాజీ సర్పంచ్



తలకాయలేని రోడ్డు మాకద్దు. ఏదైనా పెద్ద వాహనం వచ్చి జనగాంకు వెళ్లాలంటే ఆర్అండ్‌బీ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు లేకపోవడంతో శివాజీ చౌరస్తా వద్ద సికం భూమిలో ఉన్న ఇల్లు అడ్డు రావడంతో ఏ వాహనం కూడా లోనికి రాదు. అలాంటపుడు తలకాయ లేని రోడ్డు వేసి మాకేం ప్రయోజనమం.

పేరుకే గిరిజన గ్రామాలు, అభివృద్ధికి ఆమడదూరం

ఐటీడీఏ గ్రామ అధ్యక్షుడు సిడాం పోచయ్య



పేరుకు గిరిజన గ్రామాలు, ఐటీడీఏ నిధులతో అభివృద్ధి చెందేందుకు అనేక నిధులను ఇస్తున్నాం. చెప్పుకోవడమే తప్పా అభివృద్ధికి నోచుకోకుండా ఆదివాసీ గిరిజన గూడాలు ఆమడదూరంలో ఉన్నాయి. ఇప్పుడు పనులు చేపట్టిన రోడ్డును ప్రభుత్వ అనుమతి ప్రకారం ఆర్అండ్‌బీ రోడ్డు నుండి జనగాం వరకు పనులు నిర్వహించాలి.

ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తాం

గోంగ్లె సాయినాథ్, మాజీ ఉప సర్పంచ్



ఆర్అండ్‌బీ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు రెండు కల్వర్టులు ఉన్నాయి. శివాజీ చౌరస్తా వద్ద చిన్న వాహనం కూడా తిరగలేని పరిస్థితి. శివాజీ చౌరస్తా వద్ద చెరువు సికం భూమిని కబ్జా చేసుకొని ఇంటి నిర్మాణం చేపట్టిన సంబంధిత అధికారులు స్పందించకుండా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. రోడ్డు పనులను ఆర్అండ్‌బీ రోడ్డు నుండే చేపట్టాలని, లేనిపక్షంలో ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తాం.

ఎస్పీఎం క్వార్టర్‌లో గుప్త నిధుల కోసం తవ్వకాలు

- కాలనీవాసుల రాకతో పరారైన దుండగులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఓల్డ్ కాలనీలో గల ఎస్పీఎం క్వార్టర్ డి-98లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు కలకలం రేపాయి. రాత్రి సమయంలో శబ్దాలు రావడంతో కాలనీ వాసులు అక్కడికి చేరుకోగా తవ్వకాలు జరుపుతున్న ముఠా సభ్యులు క్వార్టర్ వెనుక భాగం నుండి పరారయ్యారు. పట్టణ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం క్వార్టర్‌లో తవ్వకాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపినట్లు తెలిపారు. సంఘటన స్థలంలో గడ్డపారలు, పారతో పాటు పసుపు, కుంకుమ, నిమ్మకాయ, కొబ్బరికాయలున్న సంచి, ఒక స్కూటిని స్వాధీనపర్చుకున్నారు. మొత్తం ఏడుగురు ముఠా సభ్యులు ఈ తవ్వకాలు జరిపినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు పేర్కొన్నారు.

మీడియా అకాడమీ చైర్మెన్ నియామకంపై వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై ఐజేయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ సీనియర్ సంపాదకులు జర్నలిస్టు ఉద్యమ నేత శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ అకాడమీ చైర్మన్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించడం అభినందనీయమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రివర్గానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవునూరి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వారణాసి శ్రీనివాస్, సురేష్ చారి, సయ్యద్ సోజర్, రామ్‌దాస్, మిలిన్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు బిక్కాజి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్లాస్‌మెంట్ల ఉదారత

నవతెలంగాణ-తాంసి

కడుపులో కంతితో బాధపడుతున్న హస్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీజ కూతురుకు క్లాస్‌మెట్స్ ఆర్థిక సాయం చేశారు. శ్రీజ ఇటీవల పాపకు జన్మినివ్వగా కడుపులో కంతి ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. పేద అయిన శ్రీజ గ్రామస్తుల సహకారంతో హైదరాబాద్‌కు వెళ్లి పాపకు చికిత్స అందించారు. 2010లో తాంసి హైస్కూల్‌లో చదువుకున్న క్లాస్‌మెంట్లు సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సోని, సుకుమార్, అభిలాష్‌రెడ్డి, రాములు పాప తల్లికి ఎంపిటిసి రేఖాతో కలిసి ఆర్థిక సాయాన్ని అందించారు.

కాంగ్రెస్‌లో చేరిన అర్షద్ హుస్సేన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ నియోజకవర్గ బీఎస్పీ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, కౌటాల మండల బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర నాయకులు చేరారు. వీరికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.



రైస్‌మిల్లులో భారీ నిల్వలు తేడా



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈ నెల 23వ తేదీన శ్రీసాయి బాలాజీ ఆగ్రోటెక్ రైస్‌మిల్లుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీల నిమిత్తం రాగా మిల్లు యజమాని అందుబాటులోకి రాకపోవడంతో రైస్‌మిల్లుకు సీల్ వేసిన విషయం తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పై అధికారులకు ఫిర్యాదు చేయగా కరీంనగర్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సోమవారం మండలంలోని వెంకటరావ్‌పేట్ గ్రామ సమీపంలో ఉన్న శ్రీసాయి బాలాజీ రైస్‌మిల్లులో పంచుల సమక్షంలో తాళాలు పగులగొట్టి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ నరసింహ విలేకరులతో మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన వరిధాన్యం బస్తాలు 37025 ఉండాల్సి ఉండగా కేవలం 9639 వరిధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయన్నారు. 27386 వరిధాన్యం బస్తాలు తేడా ఉన్నాయని తెలిపారు. అలాగే 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 44130 వరిధాన్యం బస్తాలు నిల్వ ఉండాలని ప్రభుత్వ ం నిర్ణయించిందని దానిలో కేవలం 122 వరిధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయని, రెండు సీజన్‌లు కలిపి 69394 బస్తాలు ఉండాల్సి ఉండగా అవి లేవన్నారు. వీటి విలువ సుమారు రూ.5.94 కోట్లు ఉంటుందని, వీటి నివేధికలను పై అధికారులకు పంపిస్తామన్నారు. ఈ తనిఖీలో కరీంనగర్ విజిలెన్స్ బృందం సీఐలు అనిల్‌కుమార్, ప్రశాంత్, దినేష్ చంద్రరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్ఓ వినోద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంలాల్ ఉన్నారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాల, ప్రతిభా హైస్కూల్, శ్రీ సత్య సాయి విద్యానికేతన్, డే అండ్ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో సఖి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య, కేస్ వర్కర్ నాగమణి మాట్లాడుతూ సఖీ కేంద్రం అందించే ఐదు రకాల కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి ఆ అవగాహన చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల, బాలికల చట్టాలు గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్ తదితర చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని విద్యార్థులకు తెలిపారు. సామాజిక స్పందన, స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, లింగ పక్షపాతాన్ని నిర్మూలించడానికి జెండర్ ఇంక్లుసివ్ భాష శక్తి వంతమైన మార్గమని వివరించారు. అత్యవసర సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్లు 181,100,1098,1930 14567ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-నార్నూర్

వెనుకబడిన మండలానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు యూసఫ్‌ఖాన్, కరీంఖాన్, మాణిక్‌రావ్ ఉన్నారు.

ఎలుకపెల్లి(బి)లో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని ఎలుకపెల్లి(బి)లో మినరల్ వాటర్‌ప్లాంటును క్లారిటీన్ సంస్థ చర్చి ఫాదర్ సీటీ సోమవారం ప్రారంభించారు. ప్రజలకు మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఫాదరులు విపిన్, జోజి, నాయకులు జావిద్ అలీ, కొట్రంగి భీమన్న, వెంకటి, అబ్బాస్, నిర్వాహకులు శంకర్ పాల్గొన్నారు.

చందాలతో చేతిపంపు వేసుకున్న ఆదివాసులు

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్



మావల మండలం బట్టిసావర్గాం గ్రామ పంచాయతీ పరిధిలోని 170 కాలనీలో సోమవారం అదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ సౌజన్యంతో కుమురం భీమ్ కాలనీ వాసులు చందాలు వేసుకొని చేతిపంపు వేసుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని చేతిపంపు వేసుకున్నామని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు గోడం గణేశ్, రాష్ట్ర సహాయక కార్యదర్శి కుంర శ్యామ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, రాష్ట్ర మహిళా కార్యదర్శి గోడం రేణుకా, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-కడెం

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని సారంగాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొల్ల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
A R B NO.353 of 2022.

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., Represented by its Divisional Legal Officer, SIRICILLA, Branch, V.Ramesh S/o Kanakaiah Aged about 32 Years, R/o.Karimangar.
...Disputant

VERSUS

Gandhe Raja Shekar & Others
1.Gandhe Raja Shekar S/o.Samba shivu Age: 27years, Occ: Sri Raja Rajeshwara Kiranam& Gen.Stores, Vemulawada, R/o.H.no.7-58/1, Surjapur, Adilabad.
2.Ameti Chandrashekar S/o. Rajesham Age: 35years, Occ: ACS R Toys Wholesale Shop, Beside Anandrao Hospital, Vemulawada, R/o.H.no.9-8-6, Bheemeshwar Temple Road, Beside Gayatri Bank Vemulawada, Rajanna Siricilla.
....Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted **on 07-03-2024** for your appearance On that day you have to appear in person **at 11.00 A.M.** Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

రైల్వేల ఆధునీకరణకు ప్రత్యేక కార్యక్రమాలు

- రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- అండర్ పాస్ బ్రిడ్జి పారంభోత్సవంలో కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైల్వేల ఆధునికరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కేంద్ర రైల్వే శాఖ దేశవ్యాప్తంగా రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ బ్రిడ్జిలు, రైల్వే స్టేషన్ల ఆధునికరణ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేసి ప్రయాణికులకు సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తోందని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం మండలంలోని బారెగూడ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వర్చువల్ ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోజురోజుకు పెరిగిపోతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ వందే భారత్ వంటి రైళ్లను ప్రజల కోసం అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. ప్రయాణికులు, ప్రజలు రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మెన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రైల్వే శాఖ అధికారులు కృషి చేయాలని, రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా తయారైన ప్లాట్ ఫామ్ నెంబర్-3లో ఆశించిన స్థాయిలో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కోచ్ పొజిషన్ బోర్డు సౌకర్యాం కల్పించాలని, సంజీవయ్య కాలనీ అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరుతూ ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో రైల్వే సేవలను విస్తరింపజేయడానికి ప్రధాని నరేంద్ర మోడి ప్రత్యేక కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ నోడల్ ఆఫీసర్ సాయి కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారామ్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎఫ్‌ఆర్‌ఓ రమాదేవి, రైల్వే సీసీఐ కైలాష్, సీసీఎస్ భాస్కర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు ఓం ప్రకాష్, సతీష్, టికెట్ ఇన్స్‌పెక్టర్ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న అర్జీలపై చర్చించారు. వేసవి కాలం నేపథ్యంలో గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల బకాయిలు వెంటనే చెల్లించాల్సిందిగా సంబంధిత శాఖలను ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ, ధరణి, పింఛన్లు, భూసంబంధిత వంటి సమస్యలకు 39 అర్జీలు వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గంగయ్య, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తు పెండింగ్ లేకుండా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాథోడ్ రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలను అందజేశారు. తలమడుగు మండలం దుర్గాపూర్ గ్రామానికి చెందిన నైతం రమణ తనకు బోరుబావి ఇప్పించాలని కోరారు. గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన కనక లాలు రామ్ ఇల్లు మంజూరు చేయాలని అర్జీని అందజేశారు. ఆదిలాబాద్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన సిడం సచిన్ ఏడ్లజత కావాలని, తలమడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తుకారాం జనరల్ స్టోర్ మంజూరు చేయాలని కోరారు. పింఛన్, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీడీకి సూచించారు. ఈ ప్రజాదర్బార్‌లో ఏపీఓ కనక భీంరావు, ఏడీఎంహెచ్ఓ కుమ్ర బాలు, ఏఓ రాంబాబు, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్ఓ సందీప్, జెడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ డీపీఓ ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఆర్డీఓ సురేష్ అన్నారు. సోమవారం అర్జీ దారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేదిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ ఆశావాహి సినీ నటుడు అభినవ్ సర్దార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ ఆవరణలో నిర్వహించిన సేవాలాల్ 285వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన విలేకరులతో సమావేశమై మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తను ఎన్నో సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ తనకు టికెట్ ఇస్తుందని ఆశాభావంతో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజలతో మమేకమై పనిచేస్తున్నానని ఎంపీగా అవకాశం ఇస్తే మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు ఆత్మారాం నాయక్ పాల్గొన్నారు.

రాంపూర్ బీటీ రోడ్డు పనులు చేపట్టాలి

నవతెలంగాణ-బెజ్జూర

మండలంలోని రాంపూర్ గ్రామానికి కొన్ని సంవత్సరాలుగా బీటీ రోడ్డు సౌకర్యం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారని, వెంటనే బీటీ రోడ్డు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించిన, వినతిపత్రాలు అందించిన పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వాలు మారిన రాంపూర్ గ్రామ ప్రజలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు మంజూరై నిధులు విడుదలైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన తర్వాత ప్రజా ప్రతినిధులు ఆపిన రోడ్డు పనులను తిరిగి ప్రారంభించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల ఉపాధ్యక్షులు చల్లూరి అశోక్ పాల్గొన్నారు.

నీటి సమస్యను అరికట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఎండాకాలంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా అరికట్టాలని ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ అన్నారు. సోమవారం ఘనపూర్ గ్రామ పంచాయతీలోని చాపరాల, గుట్టగూడలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి తండా, గూడాలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామ సమీపంలో ఉన్న బోరుబావులను సందర్శించి, గ్రామ కార్యదర్శి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే వారోత్సవాల సందర్భంగా పొదుపు చేయడం అలవాటు చేసుకోండి, ఆర్థిక లాభాలను ఆర్జించండి. సైబర్ స్మార్ట్ అవ్వండి అనే వాల్ పోస్టర్లను బ్యాంకు, జిల్లా అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోస్టర్ల ఆవిష్కరణలో లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ బాలగంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని అధికారులకు సూచించారు. కూలీలు ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శేషారావ్ పాల్గొన్నారు.

మోడీ పాలన తెలుపడానికే సంకల్ప యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ అందించిన పాలన ప్రతి గ్రామంలో తెలియజేయడానికి యాత్ర చేపట్టామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ నాయకులు అభినవ్ సర్దార్ తన సొంత ఖర్చులతో చేపట్టిన విజయ సంకల్ప యాత్రను సోమవారం శాంతినగర్‌లోని ఆయన నివాసం నుంచి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ గ్రామన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలను తెలియజేయడానికి అభినవ్ సర్దార్ విజయ సంకల్ప యాత్రను చేపట్టడం అభినందనీయమని అన్నారు. నేడు ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతిని అలవర్చుకున్నాయని అన్నారు. 3వ సారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ కావాలని, దానికి ప్రజల సహకారం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, వేదావ్యాస్, ముకుంద్, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

రేపు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 28న నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకొని అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.శ్రీనివాస్, జంతు శాస్త్రం విభాగం అధిపతి జె. విజయ్ కుమార్ సోమవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జె.సురేష్ ప్రధాన వక్తగా పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా రామాలయం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల సమక్షంలో గ్రామస్తులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.